క్లుప్తంగా

నేషనల్ హైవేపైకి వెళ్లేందుకు ర్యాంప్ నిర్మించాలి



బోధన్: పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతంలో గల గ్రీన్ ల్యాండ్స్ కమ్యూనిటీ కాలనీ నుంచి నేషనల్ హైవేపైకి వెళ్లేందుకు ర్యాంప్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ కాలనీవాసులు గురువారం సబ్ కలెక్టర్ వికాస్ మహతోను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సమస్యను ఎన్‌హెచ్‌ఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కాలనీవాసులు సబ్ కలెక్టర్‌ను కోరారు.

ప్రాథమిక చికిత్స గురించి అవగాహన కల్పించండి

వర్ని: ప్రతి ఒక్కరికి ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించాలని 108 జిల్లా మేనేజర్ వసంత్ పాపయ్య సూచించారు. గురువారం వర్నిలో 108 అంబులెన్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 108 వాహనంలో ఉన్న పరికరాలు, రికార్డులను ఆయన పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ తగిలినప్పుడు చేయాల్సిన ప్రాథమిక చికిత్స, సీపీఆర్ చేసే విధానం గురించి ప్రజలకు తెలియజేయాలని చెప్పారు.

సీసీరోడ్డు పనులకు భూమిపూజ



వేల్పూర్: మోతె గ్రామంలో ఉపాధిహామీ ద్వారా రూ.5 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులకు రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి గురువారం భూమిపూజ నిర్వహించారు. అంతకుముందు గ్రామ పంచాయతీలో లైబ్రరీని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు భగవాన్‌దాస్, రాజేశ్వర్, మదన్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ దారిలో రాకపోకలు సాగేదెట్లా?



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 23వ వార్డు శ్రీనివాస నగర్‌లో కాలనీలో ఇంటి నిర్మాణం చేపడుతున్న ఒకరు రోడ్డుపై కంకర, ఇసుక వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రాకపోకల విషయమై ఇంటి యజమాని దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో గౌడ యువజన సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చౌట్‌పల్లికి చెందిన ఆరెల్లి నవీన్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గడ్డం భరత్‌గౌడ్(కమ్మర్‌పల్లి), బి.రాకేష్‌గౌడ్(బషీరాబాద్), ప్రధాన కార్యదర్శిగా ఊట్నూర్ హరీష్‌గౌడ్(ఉప్లూర్), కార్యదర్శులుగా మధుగౌడ్, చందుగౌడ్‌లను ఎన్నుకున్నారు. గౌడ సంఘం ప్రతినిధులు మల్యాల సుభాష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దూలూర్ కిషన్‌గౌడ్, సదాశివ్‌గౌడ్, సంజీవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు

బాల్కొండ: విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ రాజేశ్వర్ అన్నారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ లోడ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరాఫరా చేపట్టనున్నట్లు తెలిపారు. ఏఈ శ్రీనివాస్, ఎల్ఐ పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

మాక్లూర్: మండల కేంద్రంలోని హర్షద్ అయూబ్‌కు చెందిన కిరాణా దుకాణంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి 10 గంటలకు హర్షద్ అయూబ్ దుకాణానికి తాళం వేసి వెళ్లగా దుండగులు తాళం పగులగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ.9వేలు అపహరించినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బాల్కొండ: మెండోరా మండలం చాకీర్యాల్ గ్రామంలో విద్యుదాఘాతంతో యానం అమృత్‌రావ్‌కు చెందిన గేదె గురువారం మృతి చెందింది. మేత కోసం వెళ్లిన గేదె విద్యుత్ స్తంభం సపోర్ట్ తీగ తగలడంతో అక్కడికక్కడే మరణించినట్లు లైన్ ఇన్‌స్పెక్టర్ చందులాల్ తెలిపారు.

అసంపూర్తిగా 'రోడ్డు' పనులు

- ప్రభుత్వం మారిన తర్వాత ఆగిన రోడ్డు విస్తరణ
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి



మెండోరా మండల కేంద్రంలో మధ్యలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు

బాల్కొండ : మెండోరా మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు, డివైడర్ పనులు అసంపూర్తిగా ఉండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2023లో గత ప్రభుత్వం రోడ్డు వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు పనులు సాగాయి. ఆ తరువాత పనులు పడకేశాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లలో నివాసముంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా ఇంటి ముందర నిర్మించుకున్న మెట్లను తొలిగించారు. రోడ్డు పనులు పూర్తయితే మళ్లీ నిర్మించుకోవచ్చని భావించారు. కాని పనులు పూర్తి కాక పోవడంతో తలుపులు, కర్రలు ఆసరాగ చేసుకుని ఇళ్లలోకి వెళ్తున్నారు. రెండు నెలల క్రితం పనులు చేపట్టాలని కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్‌రెడ్డి, కాంట్రాక్టర్‌ను వెంట తీసుకుని వచ్చి పర్యవేక్షించారు. కాని కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు. బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు చేపట్టడం లేదని సమాచారం. రోడ్డుపై కంకర ఉండటంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. అధికార యంత్రాంగం స్పందించి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్లలోకి వెళ్లాలంటే నరకం కనిపిస్తుంది. పనులు పూర్తి చేయాలని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. పనులను వెంటనే పూర్తి చేయాలి. – మోతె గంగారెడ్డి, మెండోరా

ప్రయోజనం లేకుండా పోయింది



రోడ్డు వెడల్పు పనులు చేపట్టి ప్రయోజనం లేకుండా పోయింది. ఎన్నికలకు ముందు పనులను హడావుడిగా చేపట్టారు. తరువాత పనులను చేపట్టడం లేదు. పాలకులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. – భాస్కర్‌రెడ్డి, మెండోరా

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కండెరాయుడు మల్లన్న ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు సూరి శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు గిరీష్, యువమోర్చా అధ్యక్షుడు ప్రళయ్‌తేజ్, నాయకులు అరుణ్, మల్లయ్య, మనీష్, నాగేష్, నవీన్, హరీష్, రాజేందర్, అశోక్, రవి నాయక్, ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రక్తదాన శిబిరం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవరణలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ నాయకులు లోక భూపతిరెడ్డి, పెద్దోల్ల గంగారెడ్డి, రాజు, మందుల బాలు, రాజ్‌కుమార్, దోండి ప్రకాష్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటును సద్వినియోగం చేసుకోవాలి



వాటర్ ప్లాంటును ఆవిష్కరిస్తున్న సుధాకర్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్‌వో వాటర్ ప్లాంటును సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంటును సుధాకర్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. న్యాయవాది గడ్డం మహేందర్ రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్, కోరమండల్ జోనల్ మేనేజర్ మనోజ్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పర్వీన్ సుల్తానా, పీఆర్టీయూ నాయకులు పెంట జలంధర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో సబ్‌స్టేషన్ కంట్రోల్ రూం

- చుట్టూ ప్రహరీ లేక రక్షణ కరువు
- రైతులు, పశువుల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు



సాలూర సబ్ స్టేషన్ కంట్రోల్ రూం గోడలకు ఏర్పడ్డ పగుళ్లు



చుట్టూ ప్రహరీ లేని విద్యుత్ సబ్‌స్టేషన్

బోధన్: సాలూర మండల కేంద్రం శివారులోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కంట్రోల్ రూం శిథిలావస్థకు చేరింది. 25 ఏళ్ల క్రితం సబ్ స్టేషన్‌ను నిర్మించారు. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. కంట్రోల్ రూంలో రెండు గదులు ఉండగా ఒక గదిని కరెంట్ సరఫరా నిర్వహణకు, మరో గదిని సామగ్రి నిల్వ కోసం వినియోగిస్తున్నారు. కంట్రోల్ రూం వెనుక భాగంలో గోడలకు బీటలు ఏర్పడ్డాయి. సబ్ స్టేషన్‌కు ప్రహరీ లేదు. ఇనుప తీగలతో తాత్కాలికంగా కంచెను వేశారు. సబ్ స్టేషన్ వెనుభాగం, తూర్పు దిశలో ఉన్న పంట పొలాలకు వచ్చే రైతులు, పాడి పశువుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. కొత్త భవన నిర్మాణం కోసం అనేక సార్లు ప్రతిపాదనలు పంపించారు. కాని నిధులు మంజూరు కాలేదు.

రైతులపై దాడులు అమానుషం



మాట్లాడుతున్న ప్రభాకర్

ఆర్మూర్‌టౌన్: తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసుల దాడులను, కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నామని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు బి.దేవారం, గంగారాంలు అన్నారు. గురువారం ఆర్మూర్ పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంజాబ్, యూపీ ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ మెప్పు కోసం రైతులపై అనాగరిక దాడులకు పాల్పడినట్లు విమర్శించారు. జిల్లా నాయకులు దామోదర్, రాజన్న, గంగాధర్, రమేష్, కిషన్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రుద్రూర్: పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రుద్రూర్ పోతంగల్, కోటగిరి మండలాల విద్యాధికారులు కట్ట శ్రీనివాస్, లోల శంకర్, ఎస్. శ్రీనివాస్ రావులు తెలిపారు. కోటగిరిలో రెండు కేంద్రాలు, రుద్రూర్, పోతంగల్ మండల కేంద్రాల్లో ఒక్కొక్క పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కోటగిరిలో 322 మంది, రుద్రూర్‌లో 148 మంది, పోతంగల్‌లో 181 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు మీడియం), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(ఉర్దూ మీడియం)తో పాటు జానకంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి శివలింగ గాలప్ప తెలిపారు. మొత్తం 3 కేంద్రాల్లో 380 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పెంచిన పెన్షన్ వెంటనే అమలు చేయాలి

బోధన్: దివ్యాంగులు, వృద్ధుల నెలసరి పెన్షన్ పెంచి చెల్లిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి యేశాల గంగాధర్ డిమాండ్ చేశారు. పెంచిన పెన్షన్ కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం సాలూర మండల కేంద్రంలో దివ్యాంగులు నిరసన తెలిపారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. వేదిక మండల అధ్యక్షుడు ఎస్‌కే నజీర్, ప్రతినిధులు సింగాడే లక్ష్మణ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర కల్యాణం

వేల్పూర్: వెంకటాపూర్‌లో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం వేంకటేశ్వర కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణం తిలకించారు. కానుకలు సమర్పించారు. వీడీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బోధన్ ఆర్టీసీ డీఎం బదిలీ



సన్మానిస్తున్న కార్మికులు, ఉద్యోగులు

బోధన్: బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శ్రీనివాస్ కరీంనగర్ డిపో–2కు బదిలీపై వెళ్లారు. గురువారం పట్టణ కేంద్రంలోని డిపో నుంచి రిలీవ్ అయ్యారు. 20 నెలల క్రితం నిజామాబాద్ డిపో నుంచి పదోన్నతిపై బోధన్ డీఎంగా వచ్చి ఇక్కడ విధులు నిర్వర్తించారు. బదిలీ సందర్భాన్ని పురస్కరించుకుని డిపో డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులు డీఎం శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

'గంగా కావేరి'కి బోనస్ ఇప్పించేందుకు కృషి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



వర్నిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

వర్ని/రుద్రూర్: రైతులు అధిక శాతం పండించిన గంగా కావే రి వరి రకానికి ప్రభుత్వం నుంచి బోనస్ ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం వర్ని, చందూరు, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ సొసైటీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రా ల్లో విక్రయించి లబ్ధి పొందాలని రైతులకు సూచించారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, వర్ని సొసైటీ చైర్మన్ సాయిబాబా, వైస్ చైర్మన్ వంకా నాగరాజు, నేతలు గోపాల్, రణజా నాయక్, వీర్రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అదనపు గోడౌన్ నిర్మాణానికి శంకుస్థాపన

వర్ని సొసైటీ ఆధ్వర్యంలో అదనపు గోడౌన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎస్‌డీఎఫ్ కింద మంజూరైన రూ. 12.50 లక్షలతో గోడౌన్ నిర్మాణం చేపట్టనున్న ఎమ్మెల్యే వెల్లడించారు. అసెంబ్లీలో నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ప్రజలకు వ్యక్తిగత ఆదాయం పెరుగుతుందని అన్నారు.

పోతంగల్‌లో కార్యాలయం ప్రారంభం

పోతంగల్(రుద్రూర్): నూతనంగా ఏర్పాటు చేసిన పోతంగల్ మండల కేంద్రంలో గురువారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. కోటగిరి ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న చందర్ పోతంగల్ మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ సీఈవో సాయగౌడ్, తహసీల్దార్ గంగాధర్ పాల్గొన్నారు.

కోటగిరిలో చలివేంద్రం ప్రారంభం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో గురువారం అభయ హస్తం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. చలివేంద్రం నిర్వాహకులను అభినందించారు.

తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఇరిగేషన్ అతిథి గృహంలో బల్దియా, ఇరిగేషన్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సరఫరాపై బల్దియా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పట్టణంలో పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. కాలనీల రోడ్లలో గుంతలు ఉంటే పూడ్చాలని, ఇప్పటికే పట్టణంలో మురికి కాలువలపై కల్వర్టుల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణ ప్రజలు ఆస్తి పన్ను బకాయిలు లేకుండా సకాలంలో చెల్లించాలని కోరారు. సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్, సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, కమిషనర్ వెంకట నారాయణ, తహసీల్దార్ విఠల్, ఉర్దు అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీసీసీ డెలిగెట్ గంగాశంకర్, నాయకులు తూము శరత్ రెడ్డి, తదితరులున్నారు.

ఇఫ్తార్‌కు హాజరైన ఎమ్మెల్యే, అధికారులు

రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో పట్టణంలోని ఈవెంట్ ప్లాజా ఫంక్షన్ హాల్‌లో గురువారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. విందులో అదనపు కలెక్టర్ అంకిత్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ విఠల్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సాలూర మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రారంభోత్సవం

బోధన్: సాలూర మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 3 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులు అసెంబ్లీలో ఆమోదం పొందిన నేపథ్యంలో ఆయా సామాజిక వర్గాల ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారని సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ తెలిపారు.



అసంపూర్తిగా నిలిచిన ప్రహరీ పనులు

నిధుల్లేక.. నిరుపయోగం

- పోచంపాడ్ షాదీఖానాలో వసతులు కరువు
- అసంపూర్తిగా ప్రహరీ

బాల్కొండ: లక్షలు వెచ్చించి నిర్మించిన షాదీఖాన నిరుపయోగంగా మారింది. కనీస వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో శుభకార్యాలకు పనికి రాకుండా పోతోంది. మెండోరా మండలం పోచంపాడ్‌లో 2007లో షాదీఖాన నిర్మించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో షాదీఖానను మెరుగుపర్చారు. అనంతరం చేపట్టిన ప్రహరీ పనులు నిధుల లేమితో మధ్యలోనే నిలిచిపోయాయి. కనీస వసతులైన కిచెన్ షెడ్, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మాణానికి నోచుకోలేదు. ముస్లిం సంప్రదాయం ప్రకారం వధూవరులకు వేర్వేరుగా గదులుండాల్సిన అవసరం ఉంది. అలాంటి సౌకర్యమూ కల్పించలేదు. గత ప్రభుత్వం షాదీఖాన అభివృద్ధికి రూ.25లక్షల నిధులు మంజూరు చేయగా, ప్రభుత్వం మారడంతో నిధులు నిలిచి పోయాయని మైనారిటీలు చెబుతున్నారు.



నిరుపయోగంగా ఉన్నా షాదీఖానా

వసతులు ఏర్పాటు చేయాలి



షాదీఖానా వద్ద కనీస వసతులు ఏర్పాటు చేయాలి. పేదలకు ఎంతో ఉపయో గకరంగా ఉంటుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు పూర్తిచేయాలి. – మిస్బావుద్దీన్, మాజీ సర్పంచ్, పోచంపాడ్

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 ఓ అందాల రాక్షసి 11.00, కిస్ కిస్ కిస్సిక్ 1.45, 7.35, అల్లస్ట్ 4.35, 10.25

స్క్రీన్-2 ఛావా10.00, 4.00, 10.00 పణ్ముక 1.20, 7.20

స్క్రీన్-3 సలార్–పార్ట్–1 10.00, 4.05, 10.10 పెళ్లికాని ప్రసాద్ 1.30, 7.35

స్క్రీన్-4 కోర్ట్ 10.00, 1.05, 4.10, 7.15, 10.20

మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,900	వెండి(కిలో)	1,04,500
22 క్యారెట్స్	83,897		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

తైబజార్ వేలం

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మేజర్ గ్రామపంచాయతీ తైబజారు వేలం పాటను గురువారం జీపీ ఆవరణలో నిర్వహించారు. ఈ సంవత్సరం వేలంపాట రూ.7.50 లక్షలకు రుద్రూర్ గ్రామానికి చెందిన వ్యక్తి దక్కించుకున్నారు. గత సంవత్సరం రూ.5 లక్షలు వేలంలో పలికింది. ఎంపీవో మన్మోహన్ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో వేలంపాటను నిర్వహించారు.

ఆర్మూర్‌లో ఈనెల 25న..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఈనెల 25న తైబజర్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. రోజువారి, వారంతపు సంతకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు 24 లోపు మున్సిపల్ కమిషనర్‌పై డీడీ చెల్లించాలని సూచించారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

వర్ని: మండలంలోని ఎంఈవో కార్యాలయంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు, ఇయర్ ఫోన్లు, కృత్రిమ కాళ్లు, సైకిళ్లను గురువారం ఎంఈవో



సాయిలు పంపిణీ చే శారు. సర్వ శిక్ష అభియాన్ ద్వారా మంజూరై వచ్చిన తొమ్మిది దివ్యాంగులకు ఆయన అందజేశారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల వితరణ

బాల్కొండ: వన్నెల్(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రతాప్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గడ్డం రాజేశ్వర్‌రెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్ల అప్పగింత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో పోయిన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి వాటిని సంబంధిత బాధితులకు తిరిగి అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. గురువారం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో మొత్తం మూడు ఫోన్లను వీణ, రాజు, ప్రశాంత్‌లకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

తెలుగు భాష తీరుతెన్నులపై వ్యాసరచన పోటీలు

కమ్మర్‌పల్లి: అమీర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 'నేటి తెలుగు భాష తీరుతెన్నులు' అనే అంశంపై శ్రీసుధా సాహితి కళా సమితి ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భాషా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న సమితి ప్రతినిధులు